ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం





అమరావతిలో ముఖ్యమంత్రి రెండురోజులు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి (ఎడమ నుంచి మొదటి వ్యక్తి)

చెక్కలపై నడక... తడబడితే అంతే ఇక



పెద్దల సహాయంతో చెక్కల వంతెనపై నుంచి పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు

ప్రజాశక్తి -సాలూరు రూరల్

ఆ గ్రామ ప్రజలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచంలోకి రావాలంటే పక్కనే ఉన్న వాగు దాటాల్సిందే. ప్రమాదానికి ఎదురొడ్డి చెక్కల వంతెనపై నడిచి రావాల్సిందే. నిత్యం ఈ గ్రామం నుంచి విద్యార్థులు, రోగులు, వ్యాపారులు, వివిధ అవసరాల నిమిత్తం మండల కేంద్రమైన సాలురు రావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆగ్రామ సమీపాన గెడ్డపై పాలకులు అనేక ఏళ్ల నుంచి హామీ ఇచ్చిన బ్రిడ్జి నేటికీ పూర్తి కాకపోవడంతో నిర్మాణంలో నిలిచిపోయిన ఫిల్లర్లపై చెక్కలు వేసుకొని ప్రమాదానికి ఎదురొడ్డి వాగును దాటాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నా స్పందించడం లేదని పారన్నవలస గ్రామస్తుల ఆవేదన ఇది.

మండలంలోని పారన్నవలస గ్రామ సమీపాన కూరాకుల వాగు ఉంది. ఈ వాగుపై బ్రిడ్జి లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆనాటి వైసిపి ఎమ్మెల్యే పీడీక రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చినబోరబంద ఆర్ అండ్ బి రహదారి నుంచి పారన్నవలస సిసి రహదారి, బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటీ 38 లక్షలతో 2021లో ఏషియాన్ ఇన్ఫ్రాస్ట్ర క్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ నిధులతో నిర్మాణం చేపట్ట డానికి నిధులు విడుదల చేశారు. దీని నిర్మాణానికి ఏలూరుకు చెందిన డి.నాగరాజు అండ్ కంపెనీ టెండర్ దక్కించుకొంది. ఈ కంపెనీ ఫిల్లర్ల వరకు నిర్మాణం చేసి అక్కడి వరకే బిల్లులు మంజూరు చేసుకొని, మిగతా పనులు విడిచిపెట్టి వెళ్లిపోయింది. నిబంధనల ప్రకారం రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉన్నా పనులు మధ్యలో నిలిపివేసి వెళ్లిపోవడంతో గ్రామస్తులు మళ్లీ రాజన్నదొరకు వినతి పత్రాలు అందజేశారు. ఆయన ఆ కాంట్రాక్టర్‌ను రప్పించి పనులు చేపట్టమని చెప్పినా ఆయన పట్టించుకోలేదు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల రావడం ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో చిన్న వర్షం పడ్డా ఈ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఈ ఫిల్లర్లపైనే గ్రామస్తులు చెక్కలను వేసుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయటకు వస్తున్నారు.

నలు వైపులా నీరు.. మధ్యలో ఊరు

పారన్నవలస ప్రజలకు మోక్షమెప్పుడో!

చోద్యం చూస్తున్న పాలకులు

ఈ గ్రామంలో సుమారు 700 ఇళ్లు ఉన్నాయి. సచివాలయం పనులతో పాటు ఇతర పనులకు శివరాంపురం వెళ్లాలి. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఈ బ్రిడ్జి ఫిల్లర్లపై చెక్కలు వేసి వాటిపైనే నడుచుకుంటూ చినబోర బంద వెళ్లి అక్కడ నుంచి ఆటోలు పెట్టుకొని సాలూరు మీదుగా శివరాంపురం వెళ్లాల్సి ఉంటుందని, దీంతో చాలా వ్యయ ప్రయాసాలకు గురవుతున్నామని ఖర్చులు కూడా పెరిగి చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యముగా విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలకు ఐదు కిలోమీటర్ల దూరానున్న చినబోరుబంద వెళ్ళాలి. ఇటు శివరాంపురం రావాలన్నా ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ రావాలి. ఎటు వెళ్లాలన్న చుట్టూ నీరు ఉండడంతో ఏం చేయాలో పాలుకోక ఈ ఫిల్లర్ల పైనే చెక్కలను వేసుకొని తల్లిదండ్రులు వచ్చి దగ్గరుండి ఈ చెక్కలను దాటించి వారిని పాఠశాలకు పంపడం ప్రతిరోజు నిత్యకృత్యంగా మారింది. ఈ గ్రామం నుండి చాలామంది కూలీ పనులు నిమిత్తం పక్క గ్రామాలకు వెళ్లాలన్న ఇదే చెక్కలపై నడుచుకుంటూ వెళ్లాలి. రాత్రి సమయాల్లో ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని రావాల్సి ఉంటుందని కూలీలు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లోనూ, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకెళ్లాంటే గ్రామంలోకి ఎటువంటి వాహనం రాకపోవడంతో ఈ బ్రిడ్జి దాటించాకే ఆ వాహనం వస్తుందని, మా ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామం చుట్టూ వేగావతి నది ఒకవైపు, ఈ వాగు మరో వైపు ఉండడంతో మాది ఒక ద్వీపకల్పంగా ఉంటుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు నాయకులకు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా మా గ్రామానికి కనీసం ఈ చిన్న బ్రిడ్జిని కూడా నిర్మించకుండా మధ్యలో వదిలేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

మా నాన్న నన్ను భుజాన వేసుకొని వాగు దాటిస్తున్నారు

నేను చదువు ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు సాలూరులో కొనసాగుతుంది. వర్షాకాలంలో పాఠశాలకు వెళ్లాంటే మా నాన్న నన్ను భుజంపైన వేసుకొని ప్రాణాలను గుప్పిట్లో ఉంచుకొని వాగు దాటిస్తుంటారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నిపనులున్నా మా తల్లిదండ్రులు ఎన్ని పనులున్నా నన్ను తీసుకెళ్లడం, తీసుకురావడం జరుగుతుంది. నేను ఇంటర్‌కు వచ్చినా ఈ బ్రిడ్జ్ పూర్తికాకపోవడంతో ఇబ్బందులకు గురువుతున్నాం.

బి ప్రశాంతి,
విద్యార్థిని, పారన్నవలస.

ఎక్కువ వరద వస్తే గ్రామంలోనే...

నేను వ్యవసాయ కార్మికుడ్ని చిన బోర బంద, సాలూరు, శివరాంపురం కూలీ పనులకు వెళ్తాంటాను. గ్రామం నుండి ఇక్కడి వరకు నడుచుకొంటూ వస్తూ అక్కడ ఉన్న చెక్కల మీద ప్రాణభయంతో వాగును దాటి పనులకు వెళ్తుంటాను. ఎక్కువగా వరద వస్తే రాకపోకలకు ఇబ్బంది. దీంతో ఆ సమయల్లో పనుల్లేక పస్తులుండాల్సిందే.

బలిజిరెడ్డి జగదీష్,
వ్యవసాయ కార్మికుడు, పారన్న వలస

అత్యవసర సమయాల్లో అవస్థలు

మా గ్రామం చుట్టూ మూడు వైపులా వేగావతి నది, మరోవైపు కూరాకుల వాగు ఉంది. దీంతో వర్షాకాలమైతే మా గ్రామం ఒక ద్వీపంలా ఉంటుంది. గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం వచ్చినా, గర్భిణీలకు నొప్పులు వచ్చినా చాలా ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడైతే ఫిల్లర్లుపై చెక్కలు వేసుకొని వెళ్తున్నాం. రోగులను చెక్కలపై దాటించడం ఇబ్బంది ఉంటుంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

చోంగళి అప్పల నాయుడు,
రైతు, పారన్న వలస.

ఎరువులను తెచ్చుకోవడానికి ఇబ్బందులు

శివరాంపురంతో కలిపి మా గ్రామ సచివాలయం ఒకటే. సచివాలయం పనులపై శివరాం పురం వెళ్లాలంటే వర్షాకాలంలో పూర్తిగా మర్చిపోవడమే. కనీసం వ్యవసాయానికి ఎరువులను తీసుకెళ్లాలంటే ఇబ్బందులుపడాల్సిన పరిస్థితి. ఎరువులను కొనే దానికంటే ఇక్కడకు తేవటానికే ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి.

చోంగళి లక్ష్మణ్,
రైతు, పారన్న వలస



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్ వైశాలి, డిఆర్‌ఒ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

17 నుంచి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జరగనుందని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన బ్యానర్లు, పోస్టర్లను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్‌ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, జిల్లా ఎన్సీడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.జగన్మోహనరావుతో కలిసి కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జెసి సోమవారం ఆవిష్కరించారు.

అవగాహన కల్పించి శిబిరాలకు తీసుకురావాలి

జిల్లాలో ఈనెల 17 నుంచి జరగనున్న స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ పై అవగాహన కల్పించి అవసరమైన వారిని శిబిరాలకు తీసుకురావాలని జెసి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటళ్లు, సిహెచ్‌సిల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది ద్వారా నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలకు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు, గర్భిణీలు, బాలింతల్లోని ఆరోగ్య సమస్యలు, పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు లేనివారిని గుర్తించి వైద్య శిబిరాలకు తీసుకురావాలని అన్నారు. ఎఎన్‌ఎంలు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు మాత్రమే కాకుండా జిల్లా, మండల, గ్రామస్థాయిలో వైద్య శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయత్‌రాజ్ శాఖ, మున్సిపల్ శాఖ, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్ మొదలగు శాఖాధికారులంతా సమన్వయంతో పనిచేసి అర్హులు శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహారం ఆవశ్యకత, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ఐసిడిఎస్ సిబ్బందికి కౌన్సిలింగ్ నిర్వహించి ప్రజలను చైతన్యపర్చాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారులతో పాటు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగశివ జ్యోతి, ఆర్ఎంఆర్ శ్యామల, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, బీసీ సంక్షేమాధికారి ఇ.అప్పన్న, ఇతర అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

17న జిల్లా ఆసుపత్రిలో మెడికల్ క్యాంపు : డిసిహెచ్‌ఎస్

స్వస్థ నారి శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో మెడికల్ క్యాంపును నిర్వహించనున్నట్లు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డా. జి.నాగభూషణరావు తెలిపారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని అన్నారు. 17న జిల్లా ఆసుపత్రిలో నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపు ముఖ్యంగా మహిళల కోసం ఎన్‌సిడి స్క్రీనింగ్ కోసమని తెలిపారు. ఇందులో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, స్తన క్యాన్సర్, గర్భాశయ ముఖ క్యాన్సర్, క్షయవ్యాధి (టిబి) స్క్రీనింగ్, రక్తహీనత స్క్రీనింగులు వుంటాయని అన్నారు. అలాగే యువతులు, మహిళల కోసం కౌన్సెలింగ్ సేవలు, సికిల్ సెల్ స్క్రీనింగ్ కౌన్సెలింగ్ సేవలు, గర్భిణీల కోసం గర్భధారణ సంరక్షణ తనిఖీలు, హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు సహా గర్భధారణ సమయంలో ఆహారం, సంరక్షణపై కౌన్సెలింగ్, తల్లి శిశు సంరక్షణ కార్డుల పంపిణీ, ప్రతిరక్షణ సేవలు పిల్లలకు అందించబడతాయని చెప్పారు. అంతేకాకుండా ఆరోగ్య అవగాహన సదస్సులు, మానసిక ఆరోగ్యం, పోషణ, యువతులు, మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోషణ కౌన్సెలింగ్, వెల్‌నెస్ సెషన్లు, మెగా రక్తదానం శిబిరం, ఆయుష్మాన్ భారత్ నమోదు, నిక్షయ మిత్ర వాలంటీర్ల నమోదు, ఆయుష్ క్లినిక్, కౌమార బాలికల్లో వచ్చే రుతు సమస్యలపై ప్రత్యేకమైన అవగాహన సదస్సు నిర్వహించబడునని, కావున ఈ సదావకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నల్ జగన్నాథ్

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఐటిడిఎ ఆధ్వర్యంలో పాలకొండ ఏరియా ఆసుపత్రి ద్వారా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి గ్రామీణ యువత, కాలేజీ విద్యార్థులు స్పందించి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరానికి 72 మంది హాజరవ్వగా 70 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక గిరిజనులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించడానికే ఈ రక్తదాన కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి పతకం, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయపార్వతి, పాలకొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చిరంజీవి, ఇతర వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కారం కావాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా అందిన వినతులు సత్వరమే పరిష్కారం కావాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి పనికిరాదని అధికారులకు స్పష్టం చేశారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్‌ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డిలతో కలిసి జెసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, గృహాల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితర సమస్యలకు పరిష్కారాన్ని కోరుతూ జెసికి తమ అర్జీలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 42 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో పిఒ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో సోమవారంనిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 42 వినతులు వచ్చాయి. ముగుడపేట చెందిన జన్ని రవణమ్మ హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని విన్నవించారు. బంజారుపేటకు చెందిన వరలక్ష్మి ఆర్ఒఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని, రెన్‌గూడకు చెందిన కామేశ్వరరావు, కరడసింగి గూడకు చెందిన లక్ష్మీనారాయణ చేప పిల్లలు సీడ్ ఇప్పించాలని కోరారు. పాంద్రమాను గూడకు చెందిన మంగయ్య బ్యాటరీ స్ప్రేయర్ ఇప్పించాలని, రసూల్ పేటకు చెందిన గోజరావు టివిఎస్ ఎక్సెల్ లోన్ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నదొర, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌నావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి, ఎపిడి సన్యాసిరావు, పిహెచ్‌ఒ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఫిర్యాదులకు పరిష్కారం చూపండి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఎఎస్‌పి అంకిత సురాన, సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలలో నిజా, నిజాలు ఉన్నట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ ఆదామ్, ఎస్ఐ రమేష్ నాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిహెచ్‌డబ్ల్యుల బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ సోమవారం సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యాన జెసికి వినతిపత్రం అందజేశారు. రెండు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ఆరోగ్య సేవలు అందిస్తూ కొండలు ఎక్కి దిగి పిహెచ్‌సిలు, జిల్లా ఆసుపత్రులకు పేషెంట్లను, గర్భిణులను తీసుకువస్తున్నందుకు విపరీతమైన ఆటో ఛార్జీలు ఇతర ఖర్చులు అవుతున్నాయని నెలనెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలతో సమానంగా పనులు చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశా ఖాళీ పోస్టుల్లో వీరిని నియమించాలని కోరారు. ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) యూనియన్ గౌరవాధ్యక్షులు వి.ఇందిర, ప్రధాన కార్యదర్శి ఎం.శివాని నాయకులు గౌరీ, లక్ష్మీ కమల, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల దరఖాస్తులు పునఃపరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

ఇంటి స్థలాల కొరకు దరఖాస్తులను పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి సోమవారం పునఃపరిశీలించారు. మండలంలోని కవిరిపల్లి, వెంకటభైరి పురం, మక్కువ గ్రామాలకు చెందిన కొందరు తమకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ ఇదివరకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో వాస్తవాలను తెలుసుకొని, అర్హత గల దరఖాస్తులను పరిశీలించి నివేదిక సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారులతో ఆమె మాట్లాడుతూ అర్హులకు తప్పకుండా సంక్షేమ ఫలాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో గృహ నిర్మాణ శాఖ, ఇతర సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలస కెజిబి లో అక్రమాలపై సోమవారం సాయంత్రం ఎస్-ఎస్ఎ అధికారులు విచారణ చేపట్టారు. పాఠశాలలో బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. బియ్యం పక్కదారి పట్టడంపై ఇన్‌ఛార్జి ఎస్ఒగా వ్యవహరించిన అధ్యాపకురాలు, అకౌంటెంట్‌లను అధికారులు విచారించినట్లు తెలిసింది. రికార్డులను జిసిడిఒ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి పరిశీలించారు. మంగళవారం కూడా విచారణ జరిపిన తర్వాత నివేదికను జిల్లా అధికారులకు సమర్పించనున్నారు.

17 నుంచి వాహనమిత్ర దరఖాస్తుల స్వీకరణ

పార్వతీపురం : వాహనమిత్ర పథకానికి ఈనెల 17 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నట్టు కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. అక్టోబరు 1న వాహనమిత్ర ప్రారంభం కానుందని, ఈ మేరకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందని అన్నారు. సొంత ఆటో కలిగిన డ్రైవరకు వాహన మిత్ర వర్తిస్తుందని, అయితే దిగువ తెలిపిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కుసల్‌విన్స్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక గాయత్రి స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కుసల్ విన్స్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ట్రతలిన్ అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ ఎస్.లోకేష్ సోమవారం తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఈనెల 14వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రులు కృష్ణారావు, సుజాత, స్కూల్ హెచ్ఎం ఎన్ సింహాచలం, పిఇటి రాంబాబు, విద్యార్థులు కుసల్ విన్స్‌ను అభినందించారు.

గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

డివిజన్ స్థాయి స్కూల్ పోటీలు సోమవారం స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ పాలకొండ కేంద్రంలో గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఏర్పాటు చేస్తానన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. క్రీడలు విద్యలో భాగంగా ఉండాలన్నారు. ఈ పోటీలు వల్ల పిల్లల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ సోంబాబు, నగర పంచాయతీ సమన్వయకర్త పల్లా కొండలరావు, ఎంపిపి బొమ్మల భాను, నగర పంచాయతీ చైర్మన్ ఆకుల మల్లేశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి వాకముడి అనిల్ తదితరులు ఉన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం



స్కూల్‌గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సచివాలయం ప్రారంభం

మండలంలోని తుమరాడలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయ జయకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మలు భాను, వైస్ ఎంపిపి వాముడి అనిల్, కె.అప్పలనాయుడు, జాడ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

నా కొడుకును రక్షించండి

గిరిజనుడి తల్లి ఆవేదన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి పనుల కోసమని తీసుకువెళ్ళిన తన కొడుకు బడ్నాన చిన్నారావు జమ్మూ ప్రాంతంలో ఉన్నాడని, అతడ్ని సురక్షితంగా పాచిపెంట మండలానికి రప్పించాలని కోరుతూ బడ్నాన చిన్నమ్మి అనే గిరిజన వృద్ధురాలు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేసింది. ప్రకాశం జిల్లా టంగుటూరులో చేపల చెరువుల పనుల కోసమని శ్రీకాకుళానికి చెందిన బ్రోకర్ కృష్ణ తన కొడుకుని తీసుకెళ్ళాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గత ఏడాది టంగుటూరులో తప్పిపోయిన తన కొడుకు చిన్నారావు జమ్మూ కాశ్మీర్‌లో వున్నాడని,సొంత గ్రామానికి తీసుకొచ్చే చర్యలు చేపట్టాలని కోరింది. గత వారం గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశామని, ఆయన స్పందించిన పాచిపెంట తహశీల్దార్‌తో మాట్లాడి తప్పిపోయిన చిన్నారావును రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని విలేకరులకు ఆమె వివరించింది. కలెక్టర్ బదిలీపై వెళ్ళిపోయారని, ఇప్పుడు పాచిపెంట రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన కొడుకుని రక్షించాలని కోరుతూ మరోసారి ఆమె గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేసింది. అనంతరం సిపిఎం మండల నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన చిన్నారావును జమ్మూ ప్రాంతం నుంచి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆలయ కమిటీ సభ్యుడిపై విచారణ

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయం కమిటీ సభ్యుడు పేర్ల విశ్వేశ్వరరావుపై ఆలయ ఇఒ రమేష్ సోమవారం విచారణ చేపట్టారు. బిజెపి జిల్లా నాయకుడిగా చలామణి అవుతున్న పేర్ల విశ్వేశ్వరరావు గత కొంతకాలంగా పట్టణంలోని పలు దేవాలయాల భూములు చౌకగా కొనుగోలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని వెంకటేశ్వర ఆలయం కమిటీలో సభ్యుడిగా ఎలా నియమిస్తారని ప్రశ్నిస్తూ సామాజిక కార్యకర్త హరి రెడ్డి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో ఫిర్యాదు చేశారు. విశ్వేశ్వరరావుపై భూవివాదాలకు సంబంధించిన కేసులు కూడా ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆలయం ఇఒ విచారణ చేపట్టారు. విచారణకు సంబంధించిన నివేదిక ఉన్నతాధికారులకు పంపినట్టు అధికారులు తెలిపారు.

ఉత్తమ పౌర సమాజమే జెవివి లక్ష్యం

ప్రజాశక్తి- పార్వతీపురం

ఉత్తమ పౌరు సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌కె జూనియర్ కళాశాల, జనహత డిగ్రీ కళాశాలలో ఆ వేదిక జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ రానున్న సమాజమంతా ఉత్తమ పౌరులతో నిండి ఉండాలన్న సంకల్పంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ అనే నినాదంతో మూఢాచారాలు మూఢనమ్మకాల స్థానంలో సైన్స్‌ను సద్వినియోగ పరచాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువుల హితోపదేశాన్ని ఆచరించి లక్ష్యసాధన కోసం శ్రమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా డప్పు శ్రీను ఆలపించిన చైతన్య గీతాలకు విద్యార్థులు గొంతు కలిపి ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, జి.ప్రశాంత్ కుమార్‌తో పాటు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలక రంజిత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దనాల మౌళి, కోశాధికారి కొండ గౌరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సవర భాష వాలంటీర్లకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సవర భాష విద్యా వాలంటీర్లకు సోమవారం ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ చేతుల మీదుగా సవర భాషా వాలంటీర్లకు తెలుగు -సవరభాష పుస్తకాలు ఒకొక్క విద్యార్థికి రూట్ -1 7పుస్తకాలు, రూట్ -2 7పుస్తకాలు, రూట్ -3 7పుస్తకాలు, 21పుస్తకాలు చొప్పున పంపిణీ చేశారు. ఒకటో తరగతి చదువుతున్న 1080 మంది సవర విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర డిప్యూటీ డిఇఒ జి.రామ్మోహనరావు, సిఎంఒ సిహెచ్. చిరంజీవులు, జిసిటిఒ రాములమ్మ, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక ఎస్సై జి.కళాధర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులకు గురైన బాలికలపై అత్యాచారం జరిగిన వెంటనే తమకు సమాచారమివ్వాలన్నారు. శక్తి యాప్ కూడా ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు జి.రామారావు, ఉపాధ్యాయ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని ఎంఆర్ నగర్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఉరిటి సూరినాయుడు, మచ్చ జగ్గునాయుడు ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర టిడిపి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపి పురోభివృద్ధికి స్థానిక నాయకులతో కలిసి పనిచేయాలని కొత్తగా టిడిపిలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. కాగా తెలుగుదేశం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, ఎమ్మెల్యే నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితమై ఆ పార్టీలో చేరినట్లు సూరినాయుడు, జగ్గునాయుడు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

సీతానగరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అకాడమీ 4 గేమ్స్ స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబర్చారు. మాజీ సర్పంచ్ లంక రాములు జ్ఞాపకార్థం వారి భార్య లంక లక్ష్మి, కుమారులు లంక రమేష్, లంక విద్యాసాగర్ విద్యార్థులకు నగదును, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రోత్సహించేందుకు తన తండ్రి జ్ఞాపకార్థం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు జి.నాగరాజు, డి.రామారావు, పి.రామకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

పార్వతీపురంటౌన్: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే బి.విజయచంద్ర సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి, అక్కడికక్కడే పరిష్కార కొరకు సంబంధిత అధికారులతో చర్చించారు. పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పింఛన్లు, ఇళ్లు, రోడ్లు, భూ, తదితర సమస్యలను పరిష్కరించామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని, కావున ఈ ప్రజాదర్బారును నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ

వీరఘట్టం : మండలంలోని చలివేంద్రిలో రైతులు కందల రామకృష్ణ, కోడూరి శంకర్రావు, నెల్లి రామారావు చెందిన పంట పొలాలకు సోమవారం స్థానిక వ్యవసాయ అధికారి సౌజన్య ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పిచికారీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చు, శ్రమ కూడా తగ్గుతుందని, డ్రోను ద్వారా వ్యవసాయం సాగు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం రాయితీపై రూ. 9 లక్షల 80 వేలు విలువ గల డ్రోన్ రైతులకు ఎఫ్‌పిఒ ద్వారా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ మండల యాంకర్ ఎం.సింహాచలం, ఎఫ్‌పిఒ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

60 లీటర్ల నాటు సారా పట్టివేత

సీతానగరం: మండలంలోని నిడగల్లు పంచాయతీ జగన్నాథపురంలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీం విజయవాడ టీం దాడులు నిర్వహించారని సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. ఈ దాడుల్లో పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన వండాన కిరణ్ అనే వ్యక్తి నుంచి 60 లీటర్లు నాటు సారాయితో పట్టుకొని అరెస్ట్ చేసి, సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పజెప్పారన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి బొబ్బిలి కోర్టు హాజరుపర్చగా, కోర్టు ఆదేశాల మేరకు బొబ్బిలి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

జర్నలో అగ్నిప్రమాదం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన కొండ శిఖర గ్రామం జర్నలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన ఊయక బలరాం ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో సర్వం కోల్పోయాడు. బాధితుడు బలరాం మాట్లాడుతూ పొలం పనులు నిమిత్తం సమీపంలోని కొండపాకకు వెళ్లాను. ఆ సమయంలో ఇంట్లో మంటలు వ్యాపించడంతో దాచుకున్న పత్రాలు, నిత్యవసర వస్తువులు, బట్టలు, సామాన్లతో పాటు లక్ష రూపాయలు నగదు అగ్నికి బూడిద అయిందని తెలిపాడు. విషయం తెలుసుకున్న ఆర్ఐ బిడ్డిక శివ, జూనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్, విఆర్ఒ కృష్ణారావు గ్రామానికి వెళ్లి బియ్యం, పప్పులు, కూరగాయలు అందించారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

పార్వతీపురం టౌన్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కార్మికుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ గోవిందరావు సోమవారం తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణంలో సౌందర్య థియేటర్ రోడ్డు వెనుక నిర్మాణంలో ఉన్న ఒక ప్రైవేటు భవనం పిట్ట గోడ పై కూర్చున్న కురుపాం మండలం నిక్కిడిగూడ గ్రామానికి చెందిన ఆరిక మోహనరావు (36) ప్రమాదవశాత్తూ తూగి కిందపడి మృతి చెందడంతో, భవనం ఎదురుగా ఉండే విద్యార్థులు చూసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించాం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐదు తులాల బంగారు గొలుసు చోరీ

సాలూరు: పట్టణంలోని రామాకాలనీ పార్కు సమీపంలో వున్న ఇంటిలో అక్కేరపు సత్యవతి (65) మెడలో గోల్డ్ చైన్‌ని గుర్తు తెలియని ఇద్దరు దొంగిలించి పారిపోయినట్లు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒంటరిమహిళ అయిన సత్యవతి ఇంటికి ఇద్దరు యువకులు వచ్చి ఇల్లు అద్దెకు కావాలని కోరగా ఆమె పక్క ఇంటిని చూపించారు. బెడ్ రూం చూపించడానికి లోపలికి వెళ్ళగానే ఇద్దరు యువకులు ఆమె చేతులు బంధించి మెడలో ఉన్న ఐదు తులాల బంగారు చైన్‌ని తీసుకుని స్కూటీపై పారిపోయారు. ఈ మేరకు ఆమె సాయంత్రం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - కురుపాం


కురుపాం: పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

మండలంలోని పశువైద్యాధికారిణి డాక్టర్ కె.శైలజ ఆధ్వర్యంలో సోమవారం కురుపాం, పెదగొత్తిలి, మొండెంఖల్, గుమ్మ గ్రామాల్లో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సహాయ పశువైద్య సంచాలకులు డాక్టర్ సంధ్యారాణి ఆకస్మికంగా పరిశీలించారు. మండలంలోని 25,050 పశువులకు టీకాలు వెయ్యాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 4 నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, నరేంద్ర, పశువైద్య సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కురుపాం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కద్రక కళావతి కోరారు. మండలంలోని లక్కగూడ గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పేకాపు లక్ష్మణరావు పశువులకు గాలి కుంటి వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం చెముడుగూడ, చినగీసాడ గ్రామాల్లో పశువులకు గాలి కుంటివ్యాధి నివారణ టీకాలు వేశారు.

సీతానగరం : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు తెలిపారు. మండలంలోని సూరంపేటలో గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 4 నెలలు దాటిన ప్రతి పాడి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని అన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, ు నీరసం రావడం,నోటి నుండి తీగలవలె చొంగ రావటం, నోరు మరియు కాలు గిట్టల మధ్య పుండ్లు, కొద్ది పాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈసుకుపోవటం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయని వ్యాధి వల్ల కలిగే నష్టాలు కూడా పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం -రైతుకు ఆర్థిక నష్టం ఉంటాయని అన్నారు. పాలు త్రాగే దూడల్లో మరణాలు సంభవిస్తాయన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవటం జరుగుతుందన్నారు. దూడల్లో మరణాలు నివారించి,ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

నీలకంఠపురాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కురుపాం

గిరిజనుల అభివృద్ధిని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీలకంఠపురాన్ని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు డిమాండ్ చేశారు. మండలంలోని నీలకంఠాపురంలో సర్పంచ్ ఎ.మన్మధరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రత్యేక మండల ఏర్పాటు ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 15 గిరిజన పంచాయతీలున్నాయని, ఆయా గ్రామాల గిరిజనులంతా 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కురుపాం వెళ్లాల్సి వస్తుం దన్నారు. దీంతో గిరిజన ప్రాంతాల ప్రజల అభివృద్ధి చెందడం లేదన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు, గిరిజనులు పాల్గొన్నారు.

విత్తనాలు మనమే తయారు చేసుకోవాలి

నాబార్డు డిడిఎం దినేష్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


గుమ్మలక్ష్మీపురం: అంతర పంటలను పరిశీలిస్తున్న నాబార్డు డిడిఎం దినేష్‌కుమార్‌రెడ్డి

మన వేసే పంట విత్తనాలను మనమే తయారు చేసుకోవాలని నాబార్డు డిడిఎం దినేష్‌కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో జీవా రైతుల ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను ఆయన సోమవారం పరిశీలించారు. బుడ్డెంఖర్జ గ్రామంలో పేకాపు భాగ్యలక్ష్మి మామిడిలో వేసిన వేరుసెనగ, వంగ, చిక్కుడు, బెండ, కంద, పసుపు, అల్లం, పైనాపిల్ అంతర పంటలను పరిశీలించారు. సమగ్ర వ్యవసాయ విధానంలో భాగంగా నాటు కోళ్ల పెంపకం పరిశీలించి వారి ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతు పేకాపు రామారావు దేశీయ కూరగాయల విత్తనోత్పత్తి పంటల నమూనా పరిశీలించారు. ప్రతి రైతు వారి పంటలకు కావలసిన విత్తనాలను వారే స్వయంగా పండించుకోవడం వల్ల నాణ్యమైన విత్తనంతో పాటు పురుగులు, తెగుళ్ల సమస్య తగ్గుతుందని, చాలా వరకు ఖర్చు మిగులుతుందని తెలిపారు. దేశీయ, నాటు విత్తనాలకు పురుగులను, తెగుళ్లను తట్టుకునే శక్తితో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే శక్తి సహజంగా ఉంటుందని దీని వల్ల పురుగులు, తెగుళ్ల నియంత్రణకు వెచ్చించే అనవసర ఖర్చులను రైతులు మిగుల్చుకోగలుతారని తెలిపారు. అనంతరం చింతలపాడు గ్రామంలో జీడిలో పలు రకాల అంతర పంటలను సాగు చేస్తున్న పువ్వుల పూర్ణమ్మ క్షేత్రాన్ని పరిశీలించి అభినందించారు. పూర్ణమ్మ జీడిలో వేసిన చిక్కుడు, బబ్బుర్లు, బెండ, వంగ, మిరప, వేరుసెనగ, కంది, రాగి పంటలను పరిశీలించి రైతులందరూ ఈవిధంగా చేసుకోవాలని సూచించారు. తోయక బేసు, జీలకర్ర నరేశ్ అమలు చేస్తున్న కరువు నివారిత పంటల నమూనా, శ్రీరాగి, ఎటిఎం పంటల నమూనా, ద్రవజీవామృతం తయారీలను చూసి రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా వివిధ పంటల నమూనాలు రూపొందించడం ద్వారా వారి ఆదాయాలు పెరిగేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. జట్టు ట్రస్టు ద్వారా చాలా కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా చింతలపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం గురించి వారి తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రభోదు, జట్టు ట్రస్టు ప్రతినిధి పెదపెంకి ఉమామహేశ్వరి, జీవా రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట: అంతర్ పంటలను ఎక్కువగా ఆరుతడి లేదా మెట్టు వ్యవసాయంలో ఎక్కువగా వేస్తారు కానీ ప్రకృతి సేద్య సిఆర్పి కొండేటి సురేష్ అమ్మవలసలో తన రెండు ఎకరాల వరి పొలంలో సరికొత్తగా అంతర్ పంటల ప్రయోగాన్ని చేస్తున్నారు. ఈ ప్రయోగాన్ని పరిశీలించిన వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ సాధారణంగా అంతర పంటలు అదనపు ఆదాయాన్ని పొందడం కోసం రైతులు వేస్తున్నారని, కానీ వరిలో ఎలాంటి రసాయన ఎరువులు వేయకుండా మినుము, పెసర, ఉలవ, గోంగూర, తోటకూర విత్తనాలు చల్లి నెల రోజుల తర్వాత కొనోవేడర్ సహాయంతో మట్టిలోనికి కలిపి వేసినట్లయితే పంటకు కావాల్సిన అన్ని పోషకాలు అందుతాయని తెలిపారు. ఈ ప్రయోగానికి ముందుగా పొలాన్ని దమ్ము చేసి నీరు నిలవ లేకుండా చేసి వరుసల్లో నాట్లు వేసుకోవాలని, లేదా డ్రమ్స్ లీడర్ సహాయంతో విత్తుకోవాలని తెలిపారు. పొలం గట్లపై పండ్ల మొక్కలు వేసుకుని ద్రవ జీవామృతం కుండీలను ఏర్పాటు చేసుకొని ఆ కుండీలపై పందిరి వేసి పాదు కూరగాయలను వేసుకుంటే ద్రవ జీవామృతానికి నీడనిస్తూ కూరగాయలు కూడా లభిస్తాయని తెలిపారు. అదనపు ఆదాయాన్ని పొందడంతో పాటుగా భూసారాన్ని పెంచే దిశగా ఈ ప్రయోగం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జ్ విజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలి : ఎన్‌సిడి పిఒ

ప్రజాశక్తి- సీతానగరం

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం ఏమేరకు మెరుగుపడుతుందో వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. బూర్జ గ్రామంలో హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ నిర్వహించిన సంచార చికిత్సా శిబిరంలో రోగులకు చేపడుతున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. రక్తపోటు, మధుమేహం మొదలగు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి వైద్య సిబ్బంది చేపడుతున్న వైద్య పరీక్షలను ఆయన పరిశీలించారు. పరీక్షల నివేదికలను గమనించి, మందులు వినియోగిస్తున్న విధానం, ఆహార నియమాలు, జీవనశైలిపై వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా పరీక్షల నివేదికలను పరిశీలించి ఏమేరకు బిపి, షుగరు అదుపులో ఉంటున్నాయో వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. ఒపి, ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు పరిశీలించారు. మందుల నిల్వలు, వినియోగం ఎప్పటికపుడు చూసుకోవాలన్నారు.

అన్నదాతకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి


ఎరువుల పంపిణీ వద్ద పోలీసులు పహారా

మండలంలోని బురద వెంకటాపురం గ్రామానికి చెందిన రైతులకు మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం యూరియా పంపిణీ చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అసలే యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న అన్నదాతలకు మండల కేంద్రానికి వచ్చి తీసుకు వెళ్లేందుకు ఇబ్బంది అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకు వెళ్ళారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గరుగుబిల్లి రైతు సేవా కేంద్రం ముందు చిన్న టెంట్ వేయడంతో కొద్ది మంది రైతులు టెంట్‌లో ఉండగా మరి కొంతమంది రైతులు ఎండలోనే నిరీక్షించాల్సి వచ్చింది. ఇతర గ్రామాల నుంచి వచ్చిన రైతులకు కనీసం తాగేందుకు మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరి పంటలకు సకాలంలో యూరియా వేయులేని పరిస్థితి ఏర్పడిందని దీంతో వరి పంట దిగుబడి అంతంతమాత్రంగానే వస్తుందని కర్షకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక బస్తా యూరియా కోసం పనులు మానుకొని క్యూలైన్‌లో నాలుగు నుండి అయిదు గంటలు ఉండవలసి వస్తుందని ఈ పరిస్థితి ఇంతకు ముందు ఎప్పుడూ రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో యూరియా పంపిణీకి పొంతన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ

సీతానగరం: మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీ సాఫీగా జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ పోలీసుల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల ఆధార్ కార్డులను ముందుగా తీసుకుని వారి పేర్లు నమోదు చేసుకున్న అనంతరం వారికి స్లిప్పులు అందజేస్తూ యూరియా పంపిణీ చేశారు. దాదాపు 25 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సక్రమంగా అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమం ఎఇఒలు జగదీష్, వినతేజ, సునీత పాల్గొన్నారు.

మక్కువ: మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువులు దుకాణంలో సోమవారం రైతులకు ఎరువుల పంపిణీ సాఫీగా జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ భారతి ఆధ్వర్యంలో రైతులకు స్లిప్పులు అందజేస్తూ యూరియా పంపిణీ చేశారు. దాదాపు 250బస్తాల వరకు యూరియాను రైతులకు సక్రమంగా అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాంప్రసాద్ వెన్నెల పాల్గొన్నారు. అయితే ఎరువుల కోసం రైతులు క్యూ లైన్ లో బారులు తీరారు.

17న జిల్లా విస్తృత సమావేశం

పార్వతీపురం టౌన్ : ఈనెల 17న జిల్లాస్థాయి ఎస్‌సి సామాజికవర్గ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సరిపెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన పురపాలక సంఘం, మూడు మండలాల వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 17న ఆర్య వైశ్య కళ్యాణ మండలంలో జిల్లా పార్టీ అధ్యక్షులు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలో గల జిల్లా ఎస్సీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ అనుబంధ విభాగం అధ్యక్షులు కోలా సుధాకర్, కౌన్సిలర్ నిమ్మకాయల సుధీర్, వండాన నేతాజీ, స్టేట్ ఎస్సీ అనుబంధ విభాగం కార్యదర్శి భాగ్యలక్ష్మి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శంకరరావు ఆశయ సాధనకు కృషి

సిహెచ్ బిన్నిడి లో పదో వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


శంకర్రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు, గ్రామస్తులు

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కామ్రేడ్ మండంగి శంకరరావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శంకరరావు 10వ వర్ధంతిని మండలంలోని చాపరాయి బిన్నిడి గ్రామంలో సోమవారం నిర్వహించారు. గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాలను మరువలేనివి అన్నారు. శంకరరావు 2006 నుండి 2011 వరకూ చాపరాయి బిన్నిడి పంచాయతీ సర్పంచ్, సిపిఎం నాయకుడిగా ఉంటూ పోడు పట్టాలు, రవాణా సౌకర్యం, విద్యుత్ కోసం, ఉపాధి హామీ సమస్యల కోసం అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఆయన ఉన్నంతకాలం ప్రజా సంక్షేమం కోసం ఉద్యమాలు చేశారని చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పి.ఆశరయ్య, సిపిఎం నాయకులు ఎం.సన్యాసి, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.గంగారాం, పంచాయతీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు నిర్మించాలి

ప్రజాశక్తి -సీతానగరం




నిరసన తెలుపుతున్న నాయకులు

పంచాయతీ నిధులతో తమ గ్రామంలో రోడ్లు, కాలువలు, కల్వర్టును నిర్మించాలని మండలంలోని రెడ్డివానివలస ఉప సర్పంచి రెడ్డి లక్ష్మనాయుడు, వార్డు సభ్యులు రెడ్డి అరుణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు పక్కన, కాలువ కింద నీరు మధ్యలో ఉండి పోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందిన గ్రామస్తులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. ప్రతి ఏటా అనారోగ్యం పాలై ఆసుపత్రులకు వేలకు వేలు రూపాయలు ఖర్చుపెట్టే పరిస్థితి వస్తుందన్నారు. తమ గ్రామంలో కాలువలు, కల్వర్టు లేకపోవడంతో రోడ్డు మీదే నీరుంటుందని, ఈ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ సర్పంచ్‌కు, కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఇప్పటికీ పనులు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెకె కుమారవర్మకు వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ గ్రామానికి వచ్చి పరిశీలిస్తానని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామస్తులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి అప్పలనాయుడు, ఆర్ దుర్గారావు, ఆర్ రవికుమార్, సింహాచలం నాయుడు, గంటా రాములమ్మ, జి.శ్రీరాము, ఆర్.రాఘవ, ఆర్ ప్రభాకరరావు, వసంతల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతుల ఆలోచన మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్


సబ్ కలెక్టర్‌కు వినతినిస్తున్న నాయకులు

మండలంలోని హెచ్.కారాడవలస రెవెన్యూ పరిధిలో గల ఎలుగుల మెట్ట కొండపై ఎటువంటి క్వారీ, గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చే ఆలోచన ప్రభుత్వం మానుకోవాలని, వామపక్ష, రైతు కూలీ, గిరిజన సంక్షేమ సంఘాల నాయకులు, సమీప గ్రామాల యువకులు డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ వైశాలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమీప గ్రామాల ప్రజల బతుకులు, భవిష్యత్తు నాశనం చేసే ఎటువంటి తవ్వకాలు వద్దని కోరారు. వ్యవసాయం, పర్యావరణానికి, తాగునీరు, ఆరోగ్యం, పశు పోషణ లేకుండా చేసే ఎటువంటి తవ్వకాలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌విఎస్ కుమార్ (సిపిఐ), శ్రీను నాయుడు (రైతు కూలీ సంఘం), పోలా రమణి (ప్రగతి శీలా మహిళా సంఘం), పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), కొల్లి సాంబమూర్తి (సిపిఎం), బుడిత అప్పల నాయుడు (ఎపి రైతు సంఘం), పి.సంగం(సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ), వంగళ దాలినాయుడు (కాంగ్రెస్), సింహాద్రి కిరణ్ (ఎఐవైఎఫ్), సమీప గ్రామాల యువకులు పి.గంగరాజు, పి.సంతోష్ కుమార్, డి.పృథ్వీ నాయుడు, ఎ.రాజేష్, ఆర్.అప్పల నాయుడు, కె.సీతారాం, వై.వెంకటేష్, డి.ప్రశాంత్, సూధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుర్భాషలాడిన జనసేన నాయకుడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

సర్పంచ్ వ్యవస్థపై దుర్భాషలాడిన సీతంపేట మండల జనసేన అధ్యక్షులు మండంగి విశ్వనాథంపై చర్యలు తీసుకోవాలని సర్పంచుల ఆధ్వర్యంలో సోమవారం ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌కు ఎంపిపి ఆదినారాయణ, పలువురు సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు విశ్వనాథం సర్పంచులను అసభ్యకరమైన పదజాలంతో వారి మనోభావాలు దెబ్బతీసేలా దుర్భాషలాడారని ఆ వినతిలో పేర్కొన్నారు. కావున ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో సర్పంచులు నిమ్మక తిరుపతిరావు, కూరంగి వెంకినాయుడు, బాపయ్య, ఆదిలక్ష్మి, తిరుపతి, ఎంపీటీసీ చంద్రశేఖర్, పాలకొండ నియోజకవర్గం వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సాయికుమార్, ఎంపిటిసి మంగయ్య, మోజేష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకు వినియోగించాలని అన్నారు. అనంతరం తహశీల్దార్ రాధాకృష్ణమూర్తికి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు శషపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బివి రమణ, ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కురుపాం : ఉద్యోగ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మద్రాపు మహేష్ డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ నిరసన వారం లో భాగంగా సోమవారం కురుపాంలోని పలు పాఠశాలలను ఎపిటిఎఫ్ బృందం పర్యటించింది. అనంతరం తహిసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ భూదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఎం. ఉపేంద్ర, ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మహిళలకు 'శక్తి' అండ

ప్రజాశక్తి - కురుపాం

ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ అండగా ఉంటుందని ఈగల్ బృందం ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కురుపాంలోని విజ్ఞాన భారతి, ఎంపిపి-2, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. శక్తియాప్, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఈవిటీజింగ్, మహిళ భద్రత తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు ఎన్.పద్మ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ పవర్ స్వప్నల్ జగన్నాథ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు ముటేషన్లు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవలు అందించడంలో జాప్యం చేయరాదని హెచ్చరించారు. ఆయనతో పాటు తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, సిబ్బంది ఉన్నారు.